సాక్షి
వికారాబాద్
సోమవారం । 19 । మే । 2025



కార్యదర్శి పోస్టు ఖాళీ

కరన్‌కోట్ జిల్లాలోనే మేజర్ గ్రామ పంచాయతీ. దీనికి శాశ్వత కార్యదర్శి లేక గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. 8లో▸



అన్ని మతాలకు న్యాయం

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అన్ని మతాలకు సమన్యాయం జరుగుతుందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. 8లో▸



ఇదేం విస్తరణ.!

తాండూరులో జాతీయ రహదారి విస్తరణ పనుల్లో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. 9లో▸

న్యూస్‌రీల్

కనీస వేతనాలు అమలు చేయాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మోమిన్‌పేట: కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని పెన్నార్, కార్తికేయ, ఓల్వాగ్రీన్ కంపెనీలలో పని చేస్తున్న కార్మికులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కంపెనీలలో 12 గంటలు పని చేయించుకొంటున్నా కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. దీనిపై అధికారులు సైతం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రోజుకు 12 గంటలు పని చేయించుకొంటున్న యాజమాన్యం రూ.12 వేల నుంచి రూ.18 వేలు మాత్రమే అందిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వేతనాలను రూ.26 వేల నుంచి రూ.32 వేల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు ఈ నెల 20వ తేదీన నిర్వహించే సార్వత్రిక సమ్మెకు సంబంధించి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మసయ్య, బాబు, ఆనందం, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించండి



పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన నాయకులు

మొయినాబాద్: గీత కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రేనట్ల మల్లేష్‌గౌడ్ కోరారు. ఈ మేరకు ఆదివారం నగరంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌ను కలిసి విన్నవించారు. రాష్ట్రంలో గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గౌడ కుల పరిరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు పాడి గేదెలు మృతి



ఘటనా స్థలంలో పశువుల కళేబరాలు

కందుకూరు: పిడుగుపాటుతో మూడు పాడి పశువులు మృతి చెందాయి. ఈ సంఘటన మండల పరిధి రాచులూరులో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నల్ల కలమ్మ పాడి పశువులతో కుటుంబాన్ని పోషించుకుంటుంది. రోజులాగే పొలం వద్ద చెట్టు కింద నాలుగు గేదెలను కట్టేసింది. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో పాటు, పశువుల సమీపాన పిడుగు పడటంతో మూడు మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. వాటి విలువ సుమారు రూ.3 లక్షల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరుతోంది.

శంకర్‌పల్లివాసులకు దళితరత్న అవార్డులు



అవార్డులు అందుకున్న కడమంచి మల్లేశ్, తూర్పాటి నరసింహ

శంకర్‌పల్లి: పట్టణానికి చెందిన కడమంచి మల్లేశ్, తూర్పాటి నరసింహ దళితరత్న అవార్డులు దక్కించుకున్నారు. ఈ మేరకు వారు ఆదివారం హైదరాబాద్‌లో బేడ బుడగ జంగం వ్యవస్థాపక అధ్యక్షుడు చింతల రాజలింగం, అంబేడ్కర్ ఉత్సవాల కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రాజన్న సమక్షంలో అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళితుల సంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, తిరుమల హరి, లక్ష్మయ్య, శ్రీను, శివ, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు సన్నద్ధం

5.97 లక్షల ఎకరాల్లో సాగుకు ప్రణాళికలు

- గతేడాది అత్యధికంగా పత్తికి జైకొట్టిన రైతులు
- ఈసారి జొన్న, మొక్కజొన్న వైపు దృష్టి
- రాయితీ విత్తనాలు ఇవ్వాలని అన్నదాతల డిమాండ్



పూడూరులో పొలం పనుల్లో రైతులు

వికారాబాద్: వ్యవసాయశాఖ ఖరీఫ్ సాగుకు సమాయత్తం అవుతోంది. ఇందులో భాగంగా క్షేత్రస్థాయి అధికారులతో పాటు అనుబంధ శాఖల వారిని సంప్రదించి అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించింది. దీనిపై రెండు రోజుల క్రితమే కలెక్టర్ ప్రతీక్‌జైన్ సమావేశం నిర్వహించి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ప్రధానంగా ఎరువులు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచటం, సాగులో శాస్త్రీయత పాటించటంతో పాటు నకిలీలపై అప్రమత్తం చేయాలని సూచించారు. ఇదే సమయంలో వారు క్షేత్ర స్థాయిలో చేపట్టాల్సిన చర్యలు, నిర్వహించాల్సిన కార్యక్రమాలను వివరించారు. గతేడాది ఖరీఫ్‌లో మొత్తం సాగు విస్తీర్ణం ఎంత..? ఏయే పంటలు ఎంత సాగయ్యాయి. ఈ సీజన్‌లో ఏయే పంటల విస్తీర్ణం పెంచాలి.. ఏవి తగ్గించాలి.. అనే విషయాలను ప్రస్తావించారు. డివిజన్లు, మండలాల వారీగా అందుబాటులో ఉంచాల్సిన ఎరువులు తదితర అంశాలపై ఇప్పటినుంచే ఆ శాఖ అధికారులు సన్నద్ధం అవుతున్నారు.

అవగాహనపై స్పష్టత కరువు

ఖరీఫ్‌లో భూసార పరీక్షలు, విత్తనాల ఎంపిక, అందుబాటులో ఎరువులు, తదితర వివరాలను తెలియజేయాల్సిన రైతు చైతన్య యాత్రల నిర్వహణపై స్పష్టత లేదు. మరోవైపు జిల్లాలో నకిలీ విత్తనాలు, పురుగు మందులు తదితర అంశాల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. మార్కెట్లో మాత్రం కొందరు వ్యాపారులు ఇప్పటి నుంచే బీటీ–3 పత్తి విత్తనాలను గుట్టుగా విక్రయించేందుకు తిరుగుతున్నారు. గతంలో ప్రభుత్వమే పలు రకాల విత్తనాలు, వ్యవసాయ యంత్ర పరికరాలు రాయితీపై అందించేది. గత ఐదారు ఏళ్ల నుంచి వాటిపై కోత విధిస్తూ క్రమంగా నిలిపేశారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో విత్తనాలు, వ్యవసాయ పరికరాలపై రాయితీ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

5.97 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో వచ్చే ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 5.97 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఆయా పంటలు సాగు చేయొచ్చని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. గతేడాది ప్రధానంగా పత్తిని 2.61 లక్షల ఎకరాల్లో సాగు చేయగా ఈ ఏడాది స్వల్పంగా పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. కందులు 1.50 లక్షల ఎకరాలు, వరి 1.10 లక్షల ఎకరాలు, మొక్కజొన్న 50,450 ఎకరాలు, పెసలు 13,000, మినుములు 5,000, జొన్నలు 2,500 ఎకరాల్లో సాగవుతుందని నివేదించారు. వరి, మొక్కజొన్న, జీలుగ, జనుము, సోయాబీన్, కందుల విత్తనాలను సమయానికి అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అధిక విస్తీర్ణంలో పండించే పత్తి విత్తనాలు లైసెన్సు కలిగిన ఫర్టిలైజర్ అండ్ సీడ్స్ దుకాణాలలో అవసరమైన మేరకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. ఎరువుల విషయానికొస్తే.. డీఏపీ 17,719 మెట్రిక్ టన్నులు, యూరియా 32,329 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 19,877 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 3,658 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 1,854 మెట్రిక్ టన్నులు అవసరమవుతాయని చెబుతున్నారు. మొత్తం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 75,437 మెట్రిక్ టన్నుల ఎరువులు, 54,240 క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అంచనాలను సిద్ధం చేశారు.

“ రసీదు తప్పనిసరి



ఖరీఫ్ సీజన్‌లో పంటల వారీగా ఏయే విత్తనాలు, ఎరువులు ఎన్ని అవసరమో అన్ని అందుబాటులో ఉంచుతాం. నకిలీ విత్తనాల విషయంలో రైతులు జాగ్రత్తగా ఉండాలి. కొనుగోలు చేసే సమయంలో బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. బీటీ–3 గ్లైసిల్ పత్తి విత్తనాల పట్ల జాగ్రత్తగా ఉండాలి. వాటి వాడకాన్ని ప్రభుత్వం నిషేధించింది. నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి



పర్సాపూర్‌లో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

ముమ్మరంగా ‘ఉపాధి’

- ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల్లో నిమగ్నమైన కూలీలు
- గ్రామాల్లో జోరుగా సాగుతున్న పనులు

కొడంగల్ రూరల్: ఉపాధిహామీ పథకం కూలీలకు వరంగా మారింది. ప్రస్తుతం గ్రామాల్లో ఎలాంటి పనులు లేకపోవడంతో అందరూ ఎన్‌ఆర్‌ఈజీఎస్ వైపు ఆసక్తి చూపుతున్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి ఉపాధి లభిస్తోంది. ఈ మేరకు అర్హులైన వారికి జాబ్‌కార్డులు అందిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఉపాధి హామీతో ఆర్థిక ఇబ్బందులు దూరమవుతున్నట్లు కూలీలు చెబుతున్నారు. గ్రామీణులకు ఉపాధిని కల్పించి ఆర్థిక ఇబ్బందులు తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఇందులో ప్రతి కూలీకి ఆర్థికంగా ఆసరా ఇచ్చేందుకు పనులు కల్పిస్తున్నారు. ఎండాకాలంలో పొలం పనులు సైతం తక్కువ ఉండడంతో గ్రామాల్లో ఉపాధి పనులకు జనాలు ఎగబడుతున్నారు.

4,215 మంది బిజీ

మండలంలో 26 గ్రామ పంచాయతీలతోపాటు 13 అనుబంధ గ్రామాలున్నాయి. ఇందులో 8,612 మంది జాబ్‌కార్డులు ఉన్నాయి. అందులో 4,215 మంది ఉపాధిహామీ పనులు నిర్వహిస్తున్నారని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత వేసవి కాలంలో వ్యవసాయ పనులు లేకపోవడంతో ఉపాధిహామీ వైపు కూలీలు మొగ్గు చూపుతున్నారు. భూమి చదును చేస్తూ, ఎత్తు, పల్లాలు సరిచేయడం, ఫిష్‌పాండ్, ఫాంపండ్ పనులు, రైతుల పొలాలకు వెళ్లేందుకు రహదారులు, కోతకు గురికాకుండా అడ్డుకట్ట(బండింగ్) తదితర పనులు కొనసాగుతున్నాయి. ఫాంపండ్ పనులు చేపట్టడంతో పొలాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయని, తద్వారా అధిక దిగుబడులు పొందేందుకు అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఆసక్తి ఉన్న రైతులు తమ వ్యవసాయ పొలంలో నీటి కుంటలను తవ్వించుకోవాలని చెబుతున్నారు.

“ ఆసరాగా ‘ఉపాధి’



ప్రస్తుతం వ్యవసాయ పనులు లేకపోవడంతో ఉపాధి పనులు ఆసరాగా మారాయి. జాబ్‌కార్డు ఉన్న వారు ఉపాధి పొందుతున్నారు. అన్ని రకాల పనులు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– చంద్రప్ప, ఉడిమేశ్వరం

సద్వినియోగం చేసుకోవాలి



గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలి. అర్హులైన వారికి జాబ్‌కార్డులు అందించేందుకు కృషిచేస్తున్నాం. అన్ని గ్రామాల్లో లక్ష్యం మేరకు పనులు చేపట్టాలని మేటీలకు సూచించాం.

– రాములు, ఏపీఓ, కొడంగల్

నిండుకుండలా కాగ్నా చెక్‌డ్యామ్



తాండూరు: వేసవి కాలం వచ్చిందంటే చాలు తాండూరు ప్రాంతంలో ఉన్న కాగ్నానది చుక్క నీరు లేకుండా ఇంకి పోతుంది. కానీ దశాబ్దకాలంగా నదిలో వరద నీరు పుష్కలంగా తొణికిసలాడుతోంది. నియోజకవర్గంలోని నాలుగు మండలాలను తాకుతూ ప్రవహిస్తున్న ఈ నది వేల ఎకరాలకు సాగు నీరును అందిస్తుంది. దీనిపై ఎక్కువగా చెక్‌డ్యామ్‌లు నిర్మించడంతో నీటి నిల్వ సామర్థ్యం పెరిగిందని స్థానికులు చెబుతున్నారు. తాండూరు శివారులోని కాగ్నా నదిపై ఉన్న చెక్‌డ్యామ్ నిండు కుండలా తలపిస్తోంది. మరోవైపు బెన్నూర్, వీర్‌శెట్టిపల్లి, జీవన్గి చెక్‌డ్యామ్‌లలో జలసిరి ఉట్టి పడుతుంది. ఈ సీజన్‌లో సాగు, తాగు నీటి అవసరాలకు ఇబ్బంది ఉండదని స్థానికులు భావిస్తున్నారు.

భవనాల్లేక ఇబ్బందులు

- కార్యకలాపాల నిర్వహణకు ఎదురవుతున్న ఇక్కట్లు
- తీవ్ర అవస్థల్లో మహిళా సంఘాల ప్రతినిధులు



దేవరఫసల్‌వాద్‌లో సభ్యురాలి ఇంటి ఆవరణలో సమావేశమైన సంఘం సభ్యులు (ఫైల్)

దౌల్తాబాద్: మహిళా పొదుపు సంఘాలకు సొంత భవనాలు లేక కార్యకలాపాల నిర్వహణకు ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక సంఘాల నిర్వహణ కొనసాగుతుంది. స్వశక్తి సంఘాల ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు సొంత భవనాలు లేవు. ప్రతి నెలా గ్రామాల్లోని చెట్లు, సంఘం సభ్యుల నివాసాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారు. దీంతో అతివలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వేదికలు కరువు

మండలంలో 33 గ్రామపంచాయతీల్లో 46 గ్రామ సమాఖ్య సంఘాలున్నాయి. ఇందులో సుమారు 806 స్వయం సహాయక సంఘాలు ఉండగా 8,300 మంది సభ్యులు ఉన్నారు. స్వయం ఉపాధి కార్యక్రమాల ద్వారా మహిళలు జీవనోపాధి అవకాశాలు పెంపొందించుకుంటూనే పొదుపులో ఆదర్శంగా నిలుస్తున్నాయి. గ్రామ స్థాయిలో కార్యాలయాలు లేక మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రధానంగా బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాల మంజూరు, వసూళ్లు, సభ్యుల్లో చైతన్యం పెంపొందించడంలో కీలకపాత్ర పోషించే గ్రామ సంఘాలకు సరైన వేదికలు అందుబాటులో లేకుండా పోయాయి. ఫలితంగా ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరడంలేదు.

వెంటాడుతున్న సమస్యలు

సొంత భవనాలు లేక సంఘాల కార్యకలాపాల నిర్వహణతో పాటు మహిళా సమాఖ్యలు, మహిళా పొదుపు సంఘాల సమావేశాల నిర్వహణ, శిక్షణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గ్రామైక్య సంఘాల వద్దకు వివిధ పనుల కోసం వచ్చిపోయే మహిళా సంఘాల ప్రతినిధులు, సభ్యులకు పల్లెల్లో మౌలిక వసతులు లేవు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘాల నిర్వహణ కోసం మండల కేంద్రంలో ఇందిరా క్రాంతి పథం పేరిట సొంత భవనం ఏర్పాటు చేశారు. గ్రామాల్లో సంఘ భవనాలు నిర్మిస్తే సంఘాల నిర్వహణలో తలెత్తే సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉంది. సీఎం సొంత నియోజకవర్గం కావడంతో ఇప్పుడైన మహిళలకు సొంత భవనాలు నిర్మిస్తారని మహిళలు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు.

“ ఉన్నతాధికారులకు నివేదించాం

స్వయం సహాయక సంఘాల నిర్వహణ కోసం సొంత భవనాల నిర్మాణాల విషయమై ఉన్నతాధికారులకు వివరించాం. మండలంలో భవనాలు కావాలని ప్రతిపాదనలు కూడా పంపించాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైతే నూతన నిర్మాణాలు చేపడుతారు.

– హరినారాయణ, ఇన్‌చార్జి ఏపీఎం, దౌల్తాబాద్

బైక్ టైర్‌కు చీరకొంగు చుట్టుకొని..

కేశంపేట: సహాయం కోరి బైక్‌పై వెళ్తున్న మహిళ చీర.. బైక్ టైర్‌కు చుట్టుకొని మృతి చెందింది. ఈ సంఘటన కేశంపేట మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మంగళిగూడ గ్రామానికి చెందిన యాదయ్య, బాలమణి(40) కూలీ పనులు చేసుకుంటు మహేశ్వరంలో నివసిస్తున్నారు. వీరికి 8 సంవత్సరాల కూతురు ఉంది. ఆదివారం నిర్దవెళ్లి గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లేందుకు కూతురుతో పాటు బస్టాప్‌వద్ద బస్సు కోసం వేచి ఉన్నారు. బస్సు రాకపోవడంతో భర్త యాదయ్య.. ఓ బైక్‌ను ఆపి భార్య, కూతురును కొత్తపేట గ్రామంలో వదిలి పెట్టాలని వాహనదారుడిని కోరాడు. ఈ క్రమంలో బైక్‌పై వెళ్తుండగా.. బాలమణి చీర కొంగు టైర్‌కు చుట్టుకొని కొత్తపేట గ్రామ శివారులో కిందపడింది. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా 108 సిబ్బంది.. చికిత్స నిమిత్తం బాధితురాలిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

వరుణుడి.. అలజడి



బస్టాండ్ రోడ్డులో వరద నీటి నడుమ వాహనాల రాకపోకలు



బీజేఆర్ చౌరస్తాలో కురుస్తున్న వాన

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ఒక్కసారిగా వికారాబాద్‌లో అలజడి సృష్టించింది. ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఏకధాటిగా కురిసిన వానకు రోడ్లన్నీ జలమయం అయ్యాయి. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడ్డారు. పట్టణంలో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు వర్షం కాస్త ఊరటనిచ్చింది. – అనంతగిరి



వికారాబాద్ మెయిన్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

ఆదాచేస్తేనే జీరో బిల్!

- 200 యూనిట్లు దాటితే బిల్లుల మోత
- ‘గృహజ్యోతి’పై వినియోగదారుల సంశయం

నవాబుపేట: వేసవి తాపానికి భరించలేక జనాలు ఉపశమనం కోసమని ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు అధికంగా వాడుతుంటారు. ఫలితంగా విద్యుత్ మీటర్ గిర్రున తిరుగుతుంది. దీంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న గృహజ్యోతి పథకం వర్తించకుండా పోయే ప్రమాదం పొంచి ఉంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 200 యూనిట్ల వరకు మాత్రమే ఉచిత కరెంట్ ఇస్తారు. 200 యూనిట్లు దాటితే బిల్లు చెల్లించాల్సిందే. వేసవిలో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే విద్యుత్ పొదుపు అయి గృహజ్యోతి పథకాన్ని వినియోగించుకోవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. మండలంలో 7,000 వేల విద్యుత్ కనెక్షన్లు ఉండగా.. అందులో 1,000 కమర్షియల్ కనెక్షన్లు ఉన్నాయి.

ఇవి పాటించాలి

- మార్కెట్‌లో 5స్టార్ రేటింగ్ ఉన్న విద్యుత్ ఉపకరణాలు మాత్రమే వినియోగించాలి.
- ఇంట్లో టీవీ అవసరం లేకపోతే రిమోట్‌తో కాకుండా పూర్తిగా ఆఫ్ చేయాలి.
- చార్జింగ్ పూర్తయ్యాక ఫోన్‌ను ప్లగ్ నుంచి తొలగించాలి.



- అవసరమైతేనే ఫ్యాన్లు, కూలర్లు వేయాలి.
- రిఫ్రిజిరేటర్‌లో కాలానుగుణంగా ఫ్రీజర్ లెవల్స్‌ను మార్చుకోవాలి.
- ఏసీల ఫిల్టర్లను తరచూ శుభ్రం చేస్తూ, టైమర్‌ను సెట్ చేసుకోవాలి.
- వాషింగ్‌మెషీన్‌లో లోడ్‌కు తగిన దుస్తులు మాత్రమే వేయాలి.
- నాణ్యమైన ఎస్‌ఈడీ బల్బులు వాడాలి.
- అవసరం ఉన్న గదుల్లో, అవసరమైనంత సేపే లైట్లు వేసుకోవాలి.

“ 5 స్టార్‌తో విద్యుత్ ఆదా

గృహజ్యోతి కింద 200 యూనిట్లు దాటితే మాత్రం బిల్లులు చెల్లించాల్సిందే. 5 స్టార్ రేటింగ్ ఉంటే విద్యుత్ ఆదా అవుతుంది. ఫ్యాన్, టీవీ, కూలర్లు, బల్బులు, మిక్సీ, ఐరన్ బాక్స్‌లు ఇలా ఎలక్ట్రికల్ వస్తువులు కొనుగోలు చేసే ముందు రేటింగ్ తెలుసుకోవాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ, నవాబుపేట

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి


ఎద్దు కళేబరం

ధారూరు: మేతకు వెళ్లిన ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి.. జీడీగడ్డ తండాకు చెందిన నెనావత్ రవీందర్‌నాయక్ ఎద్దులను మేతకోసం పొలానికి తీసుకెళ్లాడు. మేత మేస్తున్న ఎద్దు దగ్గరకి ఆవు రావడంతో దానిని వెంబడిస్తూ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లింది. అక్కడ ఉన్న సపోర్టు తీగను తాకింది. దానికి విద్యుత్ సరఫరా ఉండడంతో విద్యుదాఘాతానికి గురై ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ దాదాపు రూ.60వేల వరకు ఉంటుందని రైతు బోరున విలపించాడు. ఈ విషయంలో ప్రభుత్వం తనను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

ప్రేమ పేరుతో వేధింపులు

ఉరేసుకుని బాలిక ఆత్మహత్య


నిందితుడు రవి

శంషాబాద్ రూరల్: ప్రేమ పేరిట వేధింపులు భరించలేక ఓ బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని పెద్దతూప్రలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వి.జంగయ్య, అనిత దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కూతురు దివ్య(16)ను అదే గ్రామానికి చెందిన తెలగమల్ల రవి ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 16న రాత్రి భోజనం చేసిన తర్వాత అందరూ రెండో అంతస్తులో నిద్రకు ఉపక్రమించారు. అదే రోజు రాత్రి దివ్య సెల్‌ఫోన్ తీసుకుని కింద అంతస్తులోకి వెళ్లింది. ఎంతసేపటికి పైకి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా గది లోపలి నుంచి గడియపెట్టి ఉన్నది. దీంతో కిటికీ నుంచి లోపలికి చూడగా.. దివ్య చున్నీతో పైకప్పు ఉక్కుకు ఉరేసుకుని కనిపించింది. తలుపులు తెరిచి లోనికి వెళ్లి చూసేసరికి అప్పటికే మృతి చెందింది. రవి వేధింపులతోనే ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి రవిని అదుపులోకి తీసుకున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు మాడ్గుల, వెల్దండ మండలాలకు చెందిన పలువురికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆదివారం నగరంలోని ఆయన నివాసంలో లబ్ధిదారులకు అందజేశారు. సీఎం సహాయనిధి పథకం పేదలకు వరమని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేందర్‌రెడ్డి, మెకానిక్ బాబా, కృష్ణ, యాదయ్య, పోలెపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి పోస్టు ఖాళీ

కరన్‌కోట్ జిల్లాలోనే మేజర్ గ్రామ పంచాయతీ

- గతంలో పని చేసిన వారు బదిలీ
- రెగ్యులర్ లేక ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు


గ్రామ పంచాయతీ భవనం

తాండూరు రూరల్: కరన్‌కోట్ వికారాబాద్ జిల్లాలో మేజర్ గ్రామ పంచాయతీ. ఈ గ్రామానికి రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గతంలో పని చేసిన ఆనంద్‌రావు బదిలీపై యాలాల మండలానికి వెళ్లారు. ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శి పోస్టు ఖాళీగానే ఉంది. దీంతో ఈ విషయాన్ని పట్టించుకునే అధికారులు కరువయ్యారు. ఓగిపూర్ కార్యదర్శి అమరేశ్వరి కొన్ని రోజులు ఇన్‌చార్జిగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఆమె కూడా బాధ్యతల నుంచి తప్పుకున్నట్లు తెలుస్తోంది. కరన్‌కోట్ గ్రామంలో 14 వేల జనాభా ఉంది. 14 వార్డులు, 7,800ఓటర్లు ఉన్నారు. గ్రామ శివారులో సీసీఐ ఫ్యాక్టరీతో పాటు నాపరాతి గనులు ఉన్నాయి. ప్రస్తుతం గ్రామంలో 16 మంది పంచాయతీ సిబ్బంది పని చేస్తున్నారు. పెద్ద గ్రామం కావడంతో ఓ వైపు పారిశుద్ధ్య పనులు చేస్తుంటే మరోవైపు చెత్త పేరుకపోతుందని గ్రామస్తులు చెబుతున్నారు. ముందే వేసవికాలం కావడంతో తాగు నీటి సరఫరాపై కూడా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. మిషన్ భగిరథ నీరు సరఫరా నిలిచిపోతే కొన్ని కాలనీలో తాగునీటికి ప్రజలు తండ్లాడుతున్నారు. అదేవిధంగా ఈ గ్రామానికి 110 ఇందిరమ్మ ఇళ్ల మంజూరయ్యాయి. వీటిని క్షేత్రస్థాయిలో అధికారులు ఇంటింటికి వెళ్లి పరిశీలించాల్సి ఉంది. గ్రామంలో నిరుద్యోగ యువతి, యువకులు 280కి పైగా రాజీవ్ యువవికాసానికి దరఖాస్తు చేసుకున్నారు. వీటిని కూడా క్షేత్రస్థాయిలో వెళ్లిలబ్ధిదారులను ఎంపిక చేసే విషయంలో పంచాయతీ కార్యదర్శి బాధ్యత కీలకంగా ఉంటుంది. పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రికార్డుల నమోదు, నర్సరీ పరిశీలన, ఉపాధిహామీ పథకం పనుల పరిశీలనలో కార్యదర్శి పాత్ర ఉంటుంది. అంతేకాకుండా వివిధ సర్టిఫికెట్లకు సంబంధించి కార్యదర్శి సంతకం కోసం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు ప్రజలు వస్తుంటారు. ప్రస్తుతం కారోబార్ నర్సిములు అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. ఈ విషయంలో సత్వరమే ఉన్నతాధికారులు స్పందించి కరన్‌కోట్ పంచాయతీ కార్యదర్శిని వెంటనే నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు. రెగ్యులర్ కార్యదర్శి ప్రతీ రోజు గ్రామంలోనే అందుబాటులో ఉంటే సమస్యల పరిష్కారం సులువవుతాయని గ్రామస్తులు అభిప్రాయ పడుతున్నారు.

డీపీఓ దృష్టికి తీసుకెళ్లాం

కరన్‌కోట్‌లో పంచాయతీ కార్యదర్శి పోస్టు ఖాళీగా ఉందని డీపీఓ దృష్టికి తీసుకెళ్లాం. ఓగిపూర్ కార్యదర్శి అమరేశ్వరి కొన్ని రోజులు ఇన్‌చార్జిగా పని చేసింది. ప్రస్తుతం ఆమెను నియమిద్దామంటే ఇక్కడ పనిచేయడానికి సుముఖంగా లేదు. రెండు, మూడు రోజుల్లో సీనియర్ పంచాయతీ కార్యదర్శికి ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వాలనే అంశం ఆలోచన చేస్తున్నాం. లేదంటే డీపీఓ కార్యాలయం నుంచి రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించే అవకాశం ఉంది.

– సుశీల్‌కుమార్, ఎంపీఓ, తాండూరు మండలం

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య


సమావేశంలో మాట్లాడుతున్న మల్కయ్య

యాలాల: పొలం వద్ద అకారణంగా దళిత యువకుడిపై దాడికి పాల్పడ్డవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య డిమాండ్ చేశారు. ఆదివారం యాలాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కోకట్ గ్రామానికి చెందిన మాస్త అంజిలప్ప సర్వే నంబరు 183లోని ఐదెకరాల పొలంలో ట్రాక్టర్ కల్టివేటర్‌తో దున్నుతున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన పురుషోత్తంరెడ్డి, బబ్లూ రెడ్డిలు తమ పొలం గట్టు దున్నుతావా అంటూ విచక్షణ రహితంగా దాడికి పాల్పడినట్లు తెలిపారు. గతంలో కూడా అంజిలప్పపై ఇటువంటి దాడి జరిగిందన్నారు. దాడికి పాల్పడిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాంచందర్, వెంకటయ్య, చిన్న అనంతయ్య తదితరులు ఉన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన


విగ్రహ ప్రతిష్ఠాపనలో మాజీ ఎమ్మెల్యే తదితరులు

కడ్తాల్: మండల పరిధి న్యామతాపూర్ గ్రామంలో ఆదివారం శ్రీ మాత పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. ఆలయాల నిర్మాణంతో గ్రామాల్లో ఆధ్యాత్మికత, భక్తి భావం మరింత పెంపొందుతుందన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి రూ.6 లక్షలు విరాళం అందజేసిన మహేశ్‌ను సన్మానించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన బొడ్రాయి పండుగలో నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి, నాయకులు మహేశ్, రాములు పాల్గొన్నారు.

అన్ని మతాలకు సమన్యాయం


హజ్‌యాత్రకు వెళ్తున్న ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే టీఆర్‌ఆర్

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అన్ని మతాలకు సమన్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగి నియోజకవర్గం నుంచి 22 మంది ముస్లింలు హజ్‌యాత్రకు ఆదివారం బయలు దేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే నాంపల్లిలో శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముస్లింలకు హజ్‌యాత్ర పవిత్రమైందన్నారు. జీవితంలో ఒక్క సారైన హజ్‌యాత్రను సందర్శించాలనే కలా ఉంటుందన్నారు. అలాంటి కలను సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. హజ్‌యాత్రకు వెళ్లే యాత్రికులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సదుపాయాలను కల్పిస్తుందన్నారు. కాంగ్రెస్ అంటేనే అన్ని మతాలను గౌరవిస్తూ అందరికి సమన్యాయం కల్పిస్తుందన్నారు.

సెక్యూరిటీ గార్డు అదృశ్యం


రాజు

శంషాబాద్ రూరల్: ఫాంహౌజ్‌లో పని చేస్తున్న ఓ సెక్యూరిటీ గార్డు అదృశ్యమైన ఘటన మండలపరిధిలోని కవేలిగూడలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అసోం రాష్ట్రం కచార్ జిల్లాకు చెందిన రాజు తంతి(42) ఉపాధి కోసం వచ్చి కవేలిగూడలో దామోదర్‌రావుకు చెందిన గ్రీన్‌వుడ్ ఫాంహౌజ్‌లో 7 నెలలుగా సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. ఇతనితో పాటు రాకేశ్ అనే వ్యక్తి కూడా పని చేస్తూ ఇద్దరు కలిసి అక్కడే నివాసముంటున్నారు. ఈ క్రమంలో ఈనెల 10న రాజు గదికి తాళం వేసి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. 2 రోజుల తర్వాత విషయం రాజు సోదరుడు బీజుకు తెలియడంతో పలుచోట్ల ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.3.60 లక్షల విలువైన విదేశీ మద్యం పట్టివేత

- 52 మద్యం బాటిళ్లు స్వాధీనం
- ముగ్గురి పై కేసు నమోదు, ఇద్దరి అరెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: అక్రమంగా తరలిస్తున్న 52 విదేశీమద్యం బాటిళ్లను ఎక్సైజ్ పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.3.60 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఆదర్శనగర్‌లో ఓ కారులో మద్యం బాటిళ్లను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనలో ముగ్గురిపైన కేసులు నమోదు చేసిన పోలీసులు కుమార్ అగ్రవాల్, రోహిత్‌కుమార్ అనే వ్యక్తులను అరెస్ట్‌చేశారు. ఇన్నోవా కారును సీజ్ చేశారు.

మెట్రోస్టేషన్‌లో ప్రకటనల టెలివిజన్ చోరీ

సనత్‌నగర్: మెట్రో స్టేషన్‌లో ప్రకటనలు డిస్‌ప్లే చేసే టీవీ చోరీకి గురైన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ జయచందర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..పరేడ్‌గ్రౌండ్స్ మెట్రో స్టేషన్‌లోకి గత నెల 19న ఉమామహేశ్వర్, అశోక్ అనే ఇద్దరు టెక్నీషియన్స్‌గా పనిచేసేందుకు వచ్చారు. అయితే స్టేషన్ కంట్రోలర్‌కు తెలియకుండానే స్టేషన్‌లోని ఓడీయూ గదిని యాక్సెస్ చేశారు. అందులోని స్కైవర్త్ టెలివిజన్ సెట్‌ను విప్పదీసుకుని వెళ్లారు. ఈ సంఘటన మొత్తం స్టేషన్ సీసీ టీవీ కెమెరాల్లో నమోదైంది. టెలివిజన్ చోరీ అయిన విషయాన్ని గుర్తించిన మెట్రో అధికారులు, అంతర్గత విచారణ అనంతరం బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉప్పల్ మెట్రో డిపోలో పనిచేస్తున్న కృషాదర్శని ఫిర్యాదు మేరకు శనివారం బేగంపేట పోలీసులు ఉమామహేశ్వర్, అశోక్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధ దంపతులపై దాడి

వ్యక్తిపై కేసు నమోదు

హస్తినాపురం: ఇంట్లో ఒంటరిగా ఉన్న వయోవృద్ధులపై భూలక్ష్మీనగర్‌కాలనీ సంక్షేమ సంఘం సెక్రటరీ రవికిరణ్ దాడికి పాల్పడిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..ద్వారకామాయినగర్ కాలనీలో ఉంటున్న వయోవృద్ధులైన గుత్త లక్ష్మీతులసీ, వేణుగోపాల్ దంపతుల ఇంటికి భూలక్ష్మీనగర్‌కాలనీ సంక్షేమ సంఘం సెక్రటరీ రవికిరణ్ కుమారుడు వచ్చి పనులకు ఆటంకం కలిగించేవాడు. దీంతో వేణుగోపాల్ ఇంటికి రావొద్దని చెప్పడంతో నన్ను కొట్టాడని రవికిరణ్‌కు అతడి కుమారుడు చెప్పడంతో కోపోద్రిక్తుడైన రవికిరణ్ తన అనుచరులతో కలిసి ఆ దంపతుల ఇంట్లోకి ప్రవేశించి దాడికి పాల్పడ్డాడు.బాధితుల ఫిర్యాదు మేరకు రవికిరణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హెచ్‌ఐవీ మృతులకు కొవ్వొత్తులతో నివాళి


కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న వైద్య సిబ్బంది

తాండూరు టౌన్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డిస్ట్రిక్ట్ ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్‌ఐవీ ఎయిడ్స్ (దిశ) ఆధ్వర్యంలో తాండూరు ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది హెచ్‌ఐవీ మృతుల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ నివాళులర్పించారు. ప్రతి ఏటా మే 3వ ఆదివారం ప్రపంచ వ్యాప్తంగా హెచ్‌ఐవి మృతులకు నివాళులర్పిస్తూ అంతర్జాతీయ కొవ్వొత్తుల స్మారక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి నుంచి ఇందిరా చౌక్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం దిశ క్లినికల్ సర్వీసెస్ ఆఫీసర్ జి రమేశ్ మాట్లాడుతూ మనం గుర్తుంచుకుంటాం, మనం లేచి నిలుస్తాం, మనం మార్గదర్శకులు అవుదాం, హెచ్‌ఐవీ రోగుల పట్ల వివక్ష మానుకుందాం, వారిని సైతం అందరితో సమానంగా చూద్దాం అనే థీమ్‌తో ప్రజలంతా వారికి మద్దతు ఇవ్వాలన్నారు. ఆస్పత్రుల్లో హెచ్‌ఐవీ రోగుల కోసం ఉచితంగా మందులు అందజేస్తున్నారన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడుకోవచ్చు


సీపీఆర్ శిక్షణ ఇస్తున్న ఫౌండర్, కార్డియాలజీ డాక్టర్ మల్‌రెడ్డి హన్మంత్‌రెడ్డి

డాక్టర్ మల్‌రెడ్డి హన్మంత్‌రెడ్డి

మహేశ్వరం: గుండె పోటు మరణాలు పెరుగుతున్నాయని, సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడుకోవచ్చునని జనత హృదయాలయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ మల్‌రెడ్డి హన్మంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధి తుమ్మలూరు మ్యాక్ ప్రాజెక్టు బీటీఆర్‌లో ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీపీఆర్ ఉచిత శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. ఎవరైనా శ్వాస తీసుకోవడం కష్టంగా ఉన్నప్పుడు, లేదా గుండె కొట్టుకోవడం ఆగిపోయినప్పుడు చేసే అత్యవసర చికిత్స సీపీఆర్ అని తెలిపారు. ఒక వ్యక్తికి గుండె పోటు వచ్చినప్పుడు సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడవచ్చునని తెలిపారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వలన గుండె ఆరోగ్యంగా ఉంటుందని చెప్పారు. ఫౌండేషన్ నుంచి గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత శిబిరాలు నిర్వహించి, పేదలకు మేలు చేస్తున్నామని డాక్టర్ పేర్కొన్నారు. పుట్టి పెరిగిన ప్రాంతానికి సేవ చేయాలనే లక్ష్యంతో భార్యతో కలిసి ఉచితంగా వైద్య శిబిరాలు, పరీక్షలు, సీపీఆర్ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నానని వివరించారు. భవిష్యత్తులో ఫౌండేషన్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. అంతకు ముందు నిర్వహించిన సీపీఆర్ శిక్షణ కార్యక్రమంలో పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వారికి ప్రాక్టికల్ శిక్షణ, థియరీ తరగతులను వివరించారు. కార్యక్రమంలో డెర్మటాలజీ వైద్యురాలు మేతినిరెడ్డి, బీటీఆర్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, కేర్ హాస్పిటల్ వైద్యులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీరు వృథా!

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు


ట్యాప్‌లేని నల్లా వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు

దోమ: మండల పరిధిలో శివారెడ్డిపల్లి గ్రామంలో మిషన్‌భగీరథ నీరు రావడం లేదని ఫిర్యాదు రావడంతో అధికారులు కనెక్షన్‌ను తీసి నల్లాను ఏర్పాటు చేశారు. కానీ ఆ నల్లాకు ట్యాప్ పెట్టకుండానే అధికారులు వదిలేశారు. దీంతో నల్లా నుంచి నీరు వృథాగా పోతుంది. ఉదయం, రాత్రి తేడా లేకుండా తాగునీరు నేల పాలవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నీరు రోడ్డుపై చేరడంతో బురదగా తయారయ్యి నడవలేకపోతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. అంతేకాకుండా ఆ నీరు పొలాల్లో చేరి నిండుతున్నాయని చెబుతున్నారు. సంబంధిత అధికారులకు విషయం తెలిసినా అటు వైపుగా కన్నెత్తి చూడడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నల్లా కనెక్షన్లకు ఆన్‌ఆఫ్‌లను వెంటనే అమర్చి నీటి వృథాను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మైలార్‌దేవ్‌పల్లిలో దేశభక్తి ర్యాలీ


ర్యాలీ తీస్తున్న విద్యార్థులు, సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: 'ఆపరేషన్ సిందూర్' పేరిట భారత సైన్యం పాక్ ప్రేరేపిత ఉగ్ర స్థావరాలపై దాడులు చేసి నేలమట్టం చేయడంపై సేవా భారతి కిశోరి వికాస్ ఆధ్వర్యంలో ఆదివారం దేశభక్తి ర్యాలీ నిర్వహించారు. పద్మశాలీపురంలోని స్వామి వివేకానంద విగ్రహం నుంచి గణేశ్‌నగర్ బొడ్రాయి, భావన ఋషికాలనీ, ఆదర్శకాలనీ, టీఎస్‌జీఓఎస్ కాలనీ, మధుబన్ కాలనీ మార్గంలో తిరిగి స్వామి వివేకానంద విగ్రహం వద్దే ముగిసింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి మాట్లాడుతూ.. ర్యాలీ ద్వారా యువతలో దేశభక్తి పెంపొందించడం, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సేవా భారతి కిశోరి వికాస్ సమన్వయకర్త లక్ష్మి, క్లబ్ ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, సాంస్కృతిక కార్యదర్శి గోంత్యాల శ్రీనివాస్, కిశోరి వికాస్ కార్యకర్తలు అడికే శ్రావణి, ఎస్.లక్ష్మి, స్వప్న, ఝాన్సీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పెట్రోల్ ట్యాంకర్‌కు మంటలు


చర్లపల్లి పారిశ్రామికవాడలో అగ్నిప్రమాద దృశ్యం

- ట్రయల్ రన్ చేస్తుండగా ప్రమాదం
- తప్పిన పెను ప్రమాదం

కుషాయిగూడ: ప్రమాదవశాత్తు పెట్రోల్ ట్యాంకర్ కు మంటలంటుకున్న సంఘటన ఆదివారం చర్లపల్లి పారిశ్రామికవాడలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వద్ద చోటు చేసుకుంది. డ్రైవర్ అప్రమత్తతో పాటు ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. కొన్నాళ్లుగా నిలిచిపోయిన ట్యాంకర్ లారీని రిపేరు చేస్తూ ట్రయల్‌రన్ చేస్తున్న క్రమంలో చర్లపల్లి పారిశ్రామికవాడలోని ఐఓసీఎల్ వద్ద ట్యాంకర్ నుంచి ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. అప్రమత్తమైన మెకానిక్, ఇతర డ్రైవర్లు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారమివ్వడంతో ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ క్రమంలో పక్కనే ఉన్న మరో ట్యాంకర్‌కు మంటలు వ్యాపించడంతో అందరూ భయంతో పరుగులు తీశారు. అప్రమత్తమైన ఫైర్ సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి మంటలను అదుపు చేశారు. పక్కనే పార్కు చేసి ఉన్న సిలిండర్ల ట్రక్కుకు మంటల వ్యాపిస్తే పెను ప్రమాదం జరిగి ఉండేదన్నారు. ఈ విషయమై చర్లపల్లి ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌ను వివరణ కోరగా చాలా రోజులుగా నిలిచిపోయిన ట్యాంకర్ ట్రయల్‌రన్ వేస్తున్న క్రమంలోనే ప్రమాదం జరిగిందన్నారు. విచారణ చేపడతామని పేర్కొన్నారు.

యాగశాల భూమిపూజ ప్రారంభం


పూజ చేస్తున్న నాయకులు

అత్తాపూర్: హైదర్‌గూడలో ఈనెల 23 నుంచి 25 వరకు నిర్వహించే శ్రీ ప్రణవ భక్త సమాజం ఏకశత పంచోత్తర మహోత్సవ కార్యక్రమంలో భాగంగా యాగశాల కోసం ఆదివారం భూమి పూజ నిర్వహించారు. ప్రణవ భక్త సమాజం అధ్యక్షుడు మోంద్ర నర్సింహ చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రణవ భక్త సమాజం ఉపాధ్యక్షుడు బర్ల మల్లారెడ్డి, ముఖ్య సలహాదారులు నారగూడెం మల్లారెడ్డి, సాబాద విజయ్‌కుమార్, సభ్యులు సులిగె మహేందర్, విద్యాసాగర్, సాయియాదవ్, కిషన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మహోత్సవ పత్రాల పంపిణీ

శ్రీ ప్రణవ భక్త సమాజం సభ్యులు ఆదివారం ఇంటింటికీ తిరుగుతూ మహోత్సవాల పత్రికలను పంపిణీ చేసి హాజరుకావాలని కోరారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

దుద్యాల్: మండల పరిధిలోని ఈర్లపల్లి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్, కొడంగల్ ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రధాన బొడ్రాయి నుంచి ఆంజనేయ స్వామి దేవాలయం వరకు రూ.1.30 కోట్లతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రవినాయక్, సీతారాం నాయక్, కృష్ణ, రామాంజనేయులు, రవినాయక్, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.